ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 19 ఫిబ్రవరి 2025

14న వార్షిక బడ్జెట్

● స్పీకర్ అప్పావు ప్రకటన


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు మార్చి 14న ప్రారంభం కానున్నాయి. అదే రోజున ఆర్థికమంత్రి తంగం తెన్నరసు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. సచివాలయంలో మంగళవారం ఉదయం మీడియా సమావేశంలో స్పీకర్ అప్పావు ఈ వివరాలను ప్రకటించారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు జనవరి 6న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ రోజున గవర్నర్ ప్రసంగించకుండానే సభ నుండి నిష్క్రమించడంతో స్పీకర్ అప్పావు గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని చదివి వినిపించారు. ఆ తర్వాత జనవరి 11 వరకు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సాగింది. అనంతరం సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి 14న అసెంబ్లీలో బడ్జెట్ సమావేశం ఉంటుందని స్పీకర్ అప్పావు మంగళవారం మీడియా సమావేశంలో తెలిపారు. 15న వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. డీఎంకే ప్రభుత్వం వచ్చినప్పటి నుండి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడుతోంది. 14న ఉదయం 9.30 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయని ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత తొలిరోజు సమావేశాన్ని వాయిదావేస్తామని స్పీకర్ అప్పావు తెలిపారు. మరుసటి రోజు వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం ప్రవేశపెడతారని, ఆ తరువాత రెండు బడ్జెట్‌లకు సంబంధించిన ఆర్థిక అంశాలు, చేర్పులు, మార్పులపై సభ్యుల చర్చలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 21న అదనపు వ్యయభారాలు, ఆర్థిక పద్దుల ప్రతిపాదనను ఆర్థిక మంత్రి ప్రవేశపెడతారన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ చివరి వరకు జరిగే అవకాశాలున్నాయి. బడ్జెట్ సమావేశాలు ఎన్ని రోజులపాటు నిర్వహించాలనే విషయమై శాసనసభా వ్యవహార మండలి సమావేశమై తగు నిర్ణయం తీసుకుంటుంది.

● శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్ ● వేలాది మందికి ఉపాధి అవకాశాలు

తిరుచ్చి, మదురైల్లో

రూ.717 కోట్లతో టైడల్ పార్కులు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో తిరుచ్చి, మదురై నగరాల్లో రూ.717 కోట్లతో నిర్మించనున్న టైడల్ పార్కులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. తిరుచ్చి మహానగర కార్పొరేషన్ పరిధిలోని పంజపూరు వద్ద రూ.403 కోట్లతో ఆరంతస్థులతో నిర్మించనున్న టైడల్ పార్కుకు, మదురై మహానగర కార్పొరేషన్ పరిధిలో రూ.314 కోట్లతో 12 అంతస్థులతో నిర్మించనున్న టైడల్ పార్కుకు మంగళవారం ఉదయం సచివాలయం నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు.. ఈ రెండు టైడల్ పార్కుల్లో ఐటీ, ఐటీఈఎస్, బీపీఓలు, స్టార్టప్స్ వంటి సంస్థలు పనిచేస్తాయని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. ఈ రెండు టైడల్ పార్కుల నిర్మాణం పూర్తయితే తిరుచ్చి, మదురై జిల్లాల్లో 12 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆయన తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, టిడ్కో, టైడల్‌పార్క్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ నందూరి తదితరులు పాల్గొన్నారు.


సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టైడల్ పార్కులకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

ఢిల్లీ, చండీఘడ్ తమిళ సంఘాలకు తలా రూ.50 లక్షలు..

తమిళ బాషాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో ఢిల్లీ, చండీఘడ్ తమిళ సంఘాలకు తలా రూ.50లక్షల ఆర్థిక సహాయాన్ని సీఎం స్టాలిన్ అందజేశారు. ఢిల్లీ తమిళ సంఘం అధ్యక్షుడు శక్తిపెరుమాళ్, ఉపాధ్యక్షుడు పి.రాఘవన్, ప్రధాన కార్యదర్శి ఇరా ముకుందన్, చండీఘర్ తమిళ మండ్రం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి శివసుబ్రమణ్యం, డిప్యూటీ కోశాధికారి గుణశేఖరన్, రాష్ట్ర తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ మంత్రి ఎంపీ సామినాథన్, ఆ శాఖ కార్యదర్శి వి.రాజారామన్, తమిళభాషాభివృద్ధి శాఖ సంచాలకులు ఎస్. అరుళ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉద్యోగాలు..

చెన్నై, మదురైలోని ప్రభుత్వ సంగీత కళాశాల్లో నలుగురు దివ్యాంగులను లెక్చరర్ పోస్టుల్లో నియమించారు. వీరికి సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. కడలూరు జిల్లాకు చెందిన వి. కమల్‌రాజ్, తంజావూరుకు చెందిన ఇరా అమృతరాజ్ చెన్నైలోని ప్రభుత్వ సంగీత కళాశాలలో, మదురై జిల్లాకు చెందిన జె.కుమార్, కృష్ణగిరి జిల్లాకు చెందిన ఆర్.సురేష్‌బాబు మదురైలోని ప్రభుత్వ సంగీత కళాశాలలోను నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి సామినాథన్, రాష్ట్ర పర్యాటక దేవాదాయ శాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్, సాంస్కృతిక సంప్రదాయాల శాఖ సంచాలకులు కవితారాము తదితరులు పాల్గొన్నారు.

హస్తకళాకారులకు నగదు పురస్కారాలు...

రాష్ట్ర చేనేత పరిశ్రమల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో 65 యేళ్లు పైబడిన 9 మంది హస్తకళాకారులకు 'వాళుమ్ కైవినై బొక్కిషం' పేరుతో నగదు పురస్కారాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రదానం చేశారు. ఆమేరకు 2023-24 సంవత్సరానికిగాను తంజావూరు జిల్లాకు చెందిన సి.మురుగేశన్ (తంజావూరు కళాత్మక పళ్లెం), ఆర్.రాధా (అల్లిక నగిషీలు), ఈరోడ్ జిల్లాకు చెందిన ఎస్.రాజగోపాల్, (పంచలోహ శిల్పాలు) విల్లుపురం జిల్లాకు చెందిన సి.బలరామన్ (బంకమట్టితో బొమ్మలు), కన్నియాకుమారి జిల్లాకు చెందిన ఎస్.నాగముత్తు ఆచ్చారి (దారు శిల్పం), ఎస్.లిల్లీమేరీ (వెదురు కాగితం బొమ్మలు) మదురై జిల్లాకు చెందిన ఎస్.కృష్ణమూర్తి, పి. కృష్ణన్ (పంచలోహాలు) తిరువళ్లూరు జిల్లాకు చెందిన హంసాబీవీ (తాటాకులతో కళాత్మక వస్తువులు)ఈ అవార్డులు స్వీకరించారు. ఈ అవార్డు కింద ఎనిమిది గ్రాముల బంగారు పతకం, తామ్ర ప్రశంసా పత్రం, రూ. లక్ష నగదు అందుకున్నారు. ఇదే రీతిలో 2023-24 సంవత్సరానికి గాను పూంపుహార్ రాష్ట్ర స్థాయి అవార్డులను మరో తొమ్మిదిమంది కళాకారులు అవార్డులు అందుకున్నారు. చెన్నై జిల్లాకు చెందిన సీవీ రామకృష్ణన్ (లోహశిల్పం), కె.గుణసుందరి (కాగితపు గుజ్జు బొమ్మలు), సీ కాత్తాన్ (తంజావూరు చిత్రాలు), ఆర్.మెయ్యర్ (మట్టి బొమ్మలు) చెంగల్పట్టు జిల్లాకు చెందిన కె.రమేష్ (దారు శిల్పాలు), హెచ్.శ్రీధర్ (కొబ్బరి చిప్పలతో కళారూపాలు) తిరువణ్ణామలైకి చెందిన కె.కార్తీకేయన్ (తాటాకులతో కళాత్మక వస్తువులు) కడలూరు జిల్లాకు చెందిన పి. కళ్యాణ్‌కుమార్ (కాగితపు గుజ్జు బొమ్మలు), తంజావూరు జిల్లాకు చెందిన కే.చంద్రశేఖరన్ (అద్దాలతో కళాత్మక వస్తువులు)కు రూ.50 వేల నగదు, నాలుగు గ్రాముల బంగారు పతకం, తామ్ర ప్రశంసాపత్రాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామో అన్బరసన్, చేనేత శాఖ కార్యదర్శి వి.అముదవల్లి, రాష్ట్ర చేనేత పరిశ్రమల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. అమృతజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాది ద్విభాషా విధానమే

● నిర్బంధ హిందీని అంగీకరించబోం ● కేంద్రానివి బ్లాక్ మెయిల్ రాజకీయాలు
● రాష్ట్రంలో విద్యను నీరుగార్చేందుకు యత్నం
● నిధులివ్వమన్న కేంద్రమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే
● నిరసన సభలో డీఎంకే కూటమి పార్టీల డిమాండ్


కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న డీఎంకే కూటమి నేతలు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్విభాషా విధానమే ఉంటుందని డీఎంకే కూటమి పార్టీలు స్పష్టం చేశాయి. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకే, దాని మిత్రపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన సభలు నిర్వహించారు. హార్బర్ నియోజకవర్గంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన నిరసన సభలో మంత్రులు అన్బిల్ మహేష్, ఎం.సుబ్రమణ్యం, పార్లమెంటరీ డీఎంకే నేత టీఆర్ బాలు, డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి, కూటమి పార్టీల నేతలు సెల్వపెరుందగై (కాంగ్రెస్), వైగో (ఎండీఎంకే), తిరుమావళవన్ (డీపీఐ), వీరమణి (ద్రావిడర్ కళగం), షణ్ముగం (సీపీఎం), ముత్తరసన్ (సీపీఐ), ఖాదర్ మొహిద్దీన్ (ఐయూఎంఎల్), ఈశ్వరన్ (కొంగునాడు మక్కల్ కట్చి) తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కొత్త జాతీయ విద్యా విధానం అంగీకరిస్తేనే రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తామంటూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగం, చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త జాతీయ విధానం పేరుతో హిందీ నిర్బంధం చేసే ప్రయత్నం జరుగుతోందని, ఈ చర్యలు ఆయా రాష్ట్రాల మాతృభాషలను అంతం చేసేవని దుయ్యబట్టారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక, ఒకే దేశం-ఒకే ప్రభుత్వం, ఒకే దేశం-ఒకే భాష అంటూ బీజేపీ నియంత పాలన చేయాలని చూస్తోందన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పూర్తి స్థాయి మెజారిటీ సాధించి ఉంటే, రాజ్యాంగానికి బదులు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం అమలుచేసే ప్రమాదం ఉండేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వరదలు, విపత్తులు సంభవించినా కేంద్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వకపోగా కేంద్ర బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీ అడుగు పెట్టేందుకు అంగీకరించరన్నారు. ద్విభాషా విధానాన్ని ప్రతిపక్షాలు కూడా వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు పార్టీలకతీతంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం తాము చేపట్టిన నిరసన తొలి అడుగని, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమ నియంతృత్వ, మతోన్మాద రాజకీయాలకు స్వస్తి పలకని పక్షంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

మాతృభాషను కాపాడుకోవడం మా హక్కు: ఉదయనిధి

మాతృభాషను కాపాడుకోవడం తమ హక్కు, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు. ఈ నిరసన సభలో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో తాను ఉప ముఖ్యమంత్రిగా పాల్గొనలేదని, డీఎంకే కార్యకర్తగా మాత్రమే పాల్గొన్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇటీవల కేంద్రం దాఖలుచేసిన బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ. రూపాయి కూడా ఇవ్వకపోగా, తమిళనాడు అనే పదం కూడా లేదన్నారు. ప్రతి ఏడాది రాష్ట్రానికి విద్యా నిధులు అందించడం ఆనవాయితీ అని, కొత్త జాతీయ విద్యా విధానం అంగీకరించకపోవడంతో రాష్ట్రానికి రావాల్సిన రూ.2,190 కోట్ల నిధులు నిలిపివేసి, గుజరాత్ సహా పలు రాష్ట్రాలకు మళ్లించారన్నారు. ఈ నిరసన సభ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు పంపుతున్నామన్నారు. ఇస్రో చైర్మన్ సహా పలువురు శాస్త్రవేత్తలు, విదేశాల్లో ఇంజనీర్లు, డాక్టర్లు, ఇతర ఉన్నత పదవుల్లో ఉన్న వారు రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ద్విభాషా విధానంలో చదువుకున్నారని తెలిపారు. మాతృభాషను కాపాడుకోవడం కోసం ఎందరో మహనీయులు అసువులు బాశారని తెలిపారు. వారి ఆశయాలను సాధించేందుకు నిర్బంధ హిందీని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. రాజస్థానీ, బీహారీ, బోజ్‌పురి సహా పలు భాషలు హిందీ కారణంగా అంతరించాయన్నారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తున్న తాము శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సమస్య డీఎంకే, మిత్ర పక్షాలకు చెందినది మాత్రమే కాదని, రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికీ సంబంధించినదన్నారు. తమ హక్కులను సాధించుకొనేందుకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఉదయనిధి పిలుపునిచ్చారు.

త్వరలోనే నా చేతికి

అన్నాడీఎంకే పగ్గాలు

● ఓపీఎస్ జోస్యం



చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే పార్టీ పగ్గాలు త్వరలోనే తన చేతికి రానున్నాయని, ఆ తర్వాత సాధారణ కార్యకర్త పార్టీ సమన్వయకర్తగా నియమితమవుతాడని ఆ పార్టీ బహిష్కరణ నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) జోస్యం చెప్పారు. మాజీ మంత్రి బన్రూట్టి రామచంద్రన్ నేతృత్వంలో ఎగ్మూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఓపీఎస్ మాట్లాడుతూ.. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత రూపొందించిన పార్టీ నియమనిబంధనలను మార్చే అధికారం పార్టీలో ఎవరికీ లేదన్న విషయం తెలిసినా ఎడప్పాడి నియమాలు మార్చి ప్రధాన కార్యదర్శిగా ప్రకటించుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అన్నాడీఎంకే పార్టీ వ్యవహారాలలో జోక్యం చేసుకోవచ్చని హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎడప్పాడి వర్గంలో గుబులు బయలుదేరిందన్నారు. మళ్ళీ రెండాకుల గుర్తును స్తంభింపజేస్తారనే భయంపట్టుకుందని, ఆ కారణం వల్లే విడిపోయినవారందరినీ పార్టీలో చేర్చుకుంటామని చెబుతున్నారని విమర్శించారు. పార్టీ సమన్వయకర్తగా ఉన్నప్పుడు తాను సంతకం చేసిన ఫైళ్లపై ఈపీఎస్ సంతకాలు చేయకుండా బుట్టదాఖలు చేస్తుండేవారని ఓపీఎస్ ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వైద్యలింగం, శాసనసభ్యుడు మనోజ్ పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయనవి పగటి కలలు: జయకుమార్



ఇదిలా ఉండగా మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం పార్టీ పగ్గాలు తనకు వస్తాయని పగటికలలు కంటున్నారని, ఆయన్ని నాయకుడిగానే తాము భావించడం లేదని, ఆయనొక దోమలాంటివాడని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ ఎద్దేవా చేశారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదవి కోసం అర్రులు చాచే ఓపీఎస్‌ను అన్నాడీఎంకేలో చేర్చుకునేందుకు సిద్ధంగా వున్నామని ఎవ్వరూ చెప్పలేదన్నారు. తనను పార్టీలో చేర్చుకుంటామంటూ అన్నాడీఎంకే నేతలు ముందుకు వస్తున్నారని తప్పుడు ప్రకటనలు చేయడం ఓపీఎస్‌కు సిగ్గు చేటన్నారు. ఓపీఎస్‌కు డీఎంకేకు మధ్య రహస్య సంబంధాలున్న విషయం అందరికీ తెలిసిందేనని జయకుమార్ ఎద్దేవా చేశారు.

ఈపీఎస్‌తో జీకే మణి భేటీ !

కూటమి కోసమా?... రాజ్యసభ సీటు కోసమా?


ఎడప్పాడి పళనిస్వామి - జీకే మణి

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)తో పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కూటమి కట్టేందుకా? లేక జూలైలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో మద్దతు కోసమా అన్నదానిపై రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. సేలం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పళనిస్వామి, నెడుంజాలై నగర్‌లోని ఇంట్లో బస చేయగా, సోమవారం అక్కడకెళ్లిన జీకే మణి అరగంటకు పైగా భేటీ అయ్యారు. జీకే మణి బావమరిది కుమారుడి వివాహానికి ఆహ్వానించేందుకు ఈపీఎస్‌ను కలిసినట్లు పీఎంకే వర్గాలు చెబుతుండగా.. అసలు విషయం అది కాదని అన్నాడీఎంకే వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో జతకట్టిన పీఎంకే.. పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం బీజేపీ పక్షాన చేరింది. అయితే పార్లమెంటు ఎన్నికల్లో బ్యాలెట్ బాక్స్ బొక్కబోర్లా పడింది. ఇప్పటికీ పీఎంకే బీజేపీ కూటమిలోనే కొనసాగుతోంది. అయితే జూలైలో రాష్ట్రంలో ఆరు రాజ్యసభ స్థానాలకు ఎన్నిక జరుగనుంది. అందులో ఒకటి పీఎంకే అధ్యక్షుడు అన్బుమణిది కావడం గమనార్హం. మళ్లీ రాజ్యసభకు అన్బుమణి ఎన్నిక కావాలంటే అన్నాడీఎంకే సహకారం వుంటేనే సాధ్యం. లేనిపక్షంలో అన్బుమణి ఇంటికే పరిమితం కావాల్సివుంటుంది. ఈ నేపథ్యంలో ఈపీఎస్‌తో జీకే మణి భేటీ కావడంతో రాజ్యసభ సీటుపై చర్చించడానికే వీరి కలయిక జరిగినట్లు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.


తిరుపతిలో జరుగుతున్న ఐటీసీఎస్ సదస్సులో మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైని సత్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ జాయింట్ సెక్రటరీ సునీల్ దేశ్‌పాండే , గిరేష్ కులకర్ణి


వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండేకు జ్ఞాపిక అందజేస్తున్న ఏజే శేఖర్, గిరేష్ కులకర్ణి

మైలాపూర్‌లో మంగళవారం జరిగిన పద్మశ్రీ శీని విశ్వనాథన్ సత్కార కార్యక్రమంలో పాల్గొని ఆయనను సన్మానిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి. ఈ కార్యక్రమంలో నల్లి కుప్పుస్వామి చెట్టి, డాక్టర్ వైద్య సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.





సమాచార దర్శిని

మూడు రోజులు గూడూరు వరకే పినాకిని

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా పినాకినీ ఎక్స్‌ప్రెస్ గూడూరు వరకు మాత్రమే నడుస్తుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.12711 విజయవాడ- చెన్నై సెంట్రల్ పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24,27, మార్చి 1వ తేదీల్లో చెన్నై సెంట్రల్‌కు బదులుగా గూడూరు వరకు మాత్రమే నడుపనున్నారు. మరుమార్గంలో నెం.12712 చెన్నై సెంట్రల్-విజయవాడ పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24,27, మార్చి 1వ తేదీల్లో చెన్నై సెంట్రల్‌కు బదులుగా సాయంత్రం 4.15 గంటలకు గూడూరు నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

ఐసిఎఫ్‌లో 2,525 రైలు బోగీల తయారీ

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్ సమీపంలోని ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్)లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2,525 రైలు బోగీలు తయారుచేశారు. ఈ కర్మాగారంలో 175 రకాల్లో 600 డిజైన్లలో రైలు బోగీలు తయారుచేస్తున్నారు. తాజాగా, అధునాతన వసతులు, సాంకేతిక పరిజ్ఞానంతో వందే భారత్ రైళ్లు, ఎల్‌హెచ్‌బీ బోగీలు తయారుచేస్తున్నారు. ప్రతి ఏడాది మూడువేల బోగీలు తయారుచేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 3,226 బోగీలు తయారుచేయాలని లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 2,525 బోగీలు తయారుచేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యాన్ని చేరుకుంటామని ఐసిఎఫ్ అధికారులు తెలిపారు.

22 నుండి నాగై-కాంగేశన్ నౌకాసేవలు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం-కాంగేశన్ హార్బర్ మధ్య ప్రయాణికుల నౌకాసేవలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతాయని నౌక రవాణా సంస్థ ప్రకటించింది. తుఫానులు, భారీవర్షాల కారణంగా గత ఏడాది నవంబరు 18 నుంచి నౌక సేవలు నిలిచిపోగా, ఈ నెల 12వ తేది నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. కానీ, వాతావరణ మార్పులు, నిర్వహణ కారణాలతో నౌక రవాణా ప్రారంభం వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, ఈ నెల 22 నుంచి నౌకా సేవలు ప్రారంభించనున్నట్లు, ప్రయాణికులు www.sailsubham.com అనే వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు ఈ సేవలు ఉంటాయని అధికారులు తెలిపారు.

వాణిజ్య పన్నుల శాఖ ఆదాయం రూ.1.13 లక్షల కోట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖకు జనవరి 31వ తేది వరకు రూ.1.13 లక్షల కోట్లు ఆదాయం వచ్చినట్లు వాణిజ్యపన్ను, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మూర్తి తెలిపారు. నందనంలోని ఈ శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం మండల జాయింట్ కమిషనర్లతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... వాణిజ్యపన్నుల శాఖ 2023-24వ సంవత్సరంలో జనవరి 31వ తేది వరకు రూ.1,01,234 కోట్లు, 2024-25 సంవత్సరంలో జనవరి 31వ తేది వరకు రూ.1,13,235 కోట్ల ఆదాయం ఆర్జించిందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.12,001 కోట్ల ఆదాయం సమకూరిందని మంత్రి తెలిపారు.

సబర్బన్ రైళ్లలో అదనపు పోలీసు భద్రత

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుస్తున్న సబర్బన్ రైళ్లలో, రైల్వే స్టేషన్లలో అదనపు పోలీసు భద్రత కల్పించనున్నారు. పల్లవన్‌తాంగల్ రైల్వేస్టేషన్‌లో మహిళా పోలీసు నుంచి చైన్ దోపిడీ చేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. దీనిపై స్పందించిన రైల్వే పోలీసు శాఖ, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు అదనపు భద్రత ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించింది.

ఇంగ్లాండ్ వెళ్లేందుకు ప్రత్యేక వీసా శిబిరం

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లాండ్ దేశానికి వెళ్లేందుకు ప్రత్యేక వీసా శిబిరం సోమ, మంగళ, బుధవారాల్లో జరుగనుంది. ఈ మేరకు ఆ దేశ దౌత్య కార్యాలయ అధికారి హలామా హాలండ్ విడుదల చేసిన ప్రకటనలో... ఈ ప్రత్యేక వీసా పొందేవారు రెండేళ్లు ఇంగ్లాండ్‌లో విద్య, ఉద్యోగం చేసుకోవచ్చన్నారు. ఈ వీసా పొందేందుకు gov.uk అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. వారి బ్యాంక్ ఖాతాల్లో భారత కరెన్సీ ప్రకారం రూ.2.77 లక్షలు ఉండాలన్నారు.

76 మెడికల్ షాపుల లైసెన్స్ రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సిఫారసు చీటి లేకుండా మందులు విక్రయించిన 76 మెడికల్ షాపుల లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. గత జనవరి 1వ తేది నుంచి ఆదివారం వరకు చీటీ లేకుండా మందులు విక్రయించిన 59 దుకాణాల లైసెన్స్ తాత్కాలికంగా, వైద్యుల సిఫారసు లేకుండా, అబార్షన్, మత్తుమాత్రలు విక్రయిస్తున్న 17 దుకాణాల లైసెన్స్ పూర్తిగా రద్దు చేసినట్లు రాష్ట్ర మందుల నియంత్రణ డైరెక్టరేట్ అధికారి ఎంఎన్ శ్రీధర్ తెలిపారు.

లైంగిక వేధింపులకు నిరసనగా

అన్నాడీఎంకే విద్యార్థి విభాగం ధర్నా

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నిరోధించలేకపోతున్నారని డీఎంకే ప్రభుత్వానికి నిరసనగా అన్నాడీఎంకే విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా జరిగింది. మాజీ మంత్రి పి.వలర్మతి నాయకత్వంలో నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టమ్ వద్ద విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. అన్నాడీఎంకే విద్యార్థి విభాగం నేతలు సింగై రామచంద్రన్, న్యాయవాది ఎ. పళని, పురసై వి.ఎస్.బాబు, వెట్రిలై కే మారిముత్తు, పట్‌మేడు డి.సారథి, కేసీ గార్డెన్ ఎం.చంద్రశేఖర్, మహమ్మద్ ఇంతియాస్ తదితరులు ధర్నాలో పాల్గొని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



వళ్లువర్‌కోట్టమ్ వద్ద ధర్నా చేస్తున్న అన్నాడీఎంకే విద్యార్థి విభాగం నేతలు, కార్యకర్తలు

జింఖానా క్లబ్ పిటిషన్ కొట్టివేత

అడయార్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి రేస్ కోర్స్ మైదానంలో వర్షపునీటి నిల్వ కేంద్రాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ జింఖానా క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. గిండి రేస్ కోర్సులో 147 సంవత్సరాల క్రితం గోల్ఫ్ మైదానాన్ని నిర్మించారు. ఈ క్లబ్ మద్రాస్ జింఖానా క్లబ్ నిర్వహణలో ఉంది. అయితే, రేస్ కోర్సు లీజుకు ఇచ్చిన 160 ఎకరాల లీజును ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రేస్ క్లబ్‌లోని పలు ప్రవేశద్వారాలకు సీలు కూడా వేసింది. దీనిని వ్యతిరేకిస్తూ జింఖానా క్లబ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ నేపథ్యంలో జింఖానా మైదానంలో నీటివనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం నీటి నిల్వ కేంద్రాల నిర్మాణం చేపట్టింది. ఈ నిర్మాణ పనుల వల్ల గోల్ఫ్ మైదానికి ఎలాంటి హాని కలుగకుండా ఆదేశించాలని కోరుతూ జింఖానా క్లబ్ మరో పిటిషన్ హైకోర్టులో వేసింది. ఈ పిటిషన్‌లో గోల్ఫ్ మైదానం చరిత్రను వివరించారు. 1951లో గోల్ఫ్ మైదానం సమీపంలో క్లబ్ హౌస్‌ను నిర్మించారని, ఇక్కడ 50 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. దేశంలోనే పురాతన గోల్ఫ్ క్లబ్‌గా పేరుందని, ఈ మైదానికి వెళ్ళే ప్రవేశద్వారానికి ప్రభుత్వం సీలు వేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో గోల్ఫ్ మైదానంలో నీటి నిల్వ కేంద్రాలను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. ఈ నిర్మాణ పనుల వల్ల గోల్ఫ్ మైదానం దెబ్బతింటుందని, దీన్ని తిరిగి సరిచేసేందుకు రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. అందువల్ల ఈ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోరారు.

ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి భరత చక్రవర్తి విచారించి, రేస్ కోర్సు కోసం లీజుకు ఇచ్చిన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ముందు జింఖానా మైదానం నిర్వాహకులకు ముందస్తు నోటీసు ఇవ్వలేదని చెబుతున్న వాదనలో నిజం లేదంటూ, నిర్మాణాలకు పచ్చజెండా ఊపుతూ, పిటిషన్‌ను కొట్టివేశారు.

చిత్తూరు జాతీయ రహదారి విస్తరణకు శ్రీకారం

తిరుత్తణి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జాతీయ రహదారిని ఫోర్‌లేన్ పనులకు సోమవారం తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ భూమి పూజ చేశారు. షోలింగర్ నుంచి చిత్తూరు వరకు ఉన్న డబల్ రోడ్డును ఫోర్‌లేన్‌గా మార్చే ప్రాజెక్ట్ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణాలకు రూ.39 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో గోపాలపురం నుంచి ఎరుంబి వరకు రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో డీఎంకే మండల కార్యదర్శులు షణ్ముగం, పళని, బీడీఓ కలైసెల్వి సహా పలువురు అధికారులు, పార్టీల నేతలు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

మహిళ హత్య..తండ్రీకొడుకుల అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహిళను హతమార్చిన కేసులో భర్త, ఇద్దరు కుమారులను పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం జిల్లా వాళప్పాడి సమీపం మేట్టుఉడయార్‌పాళయం ప్రాంతానికి చెందిన పొన్నువేలు-వసంతి దంపతులకు కవిన్ (21), నటనాలయ (17) అనే ఇద్దరు కుమారులున్నారు. వసంతి కొద్దిరోజులుగా ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడుతున్నట్లు, ఆమె నడవడికను అనుమానించిన తండ్రి, కుమారులు ఆమెను మందలించినట్లు సమాచారం. కానీ, ఆమె వారి మాటలు లెక్కచేయక సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోంది. ఆదివారం రాత్రి కూడా ఆమె అధిక సమయం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండడం గమనించిన తండ్రి, కుమారులు ఆమెతో వాగ్వివాదానికి దిగారు. ఒకానొక సమయంలో ముగ్గురు ఆమెపై దాడిచేశారు. ఈ దాడిలో స్పృహ కోల్పోయిన ఆమెను వారు వాళప్పాడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై వాళప్పాడి పోలీసులు కేసు నమోదుచేసి, తండ్రి, ఇద్దరు కుమారులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో కొంతకాలంగా మాదకద్రవ్యాల చెలామణి, విక్రయాలు అధికమవుతున్నాయి. వీటిని అడ్డుకొనేలా పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వులతో మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. నుంగంబాక్కం కాలేజ్ రోడ్డులో సోమవారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపట్టి, ముగ్గురిని అనుమానించి విచారించారు. వారు పొంతన లేని సమాధానాలివ్వడంతో వారు బ్యాగులు తనిఖీ చేసి, ఆరు గ్రాముల మెత్తాంబెటామైన్, రూ.12,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు, 26 సిరింజ్‌లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు విల్లుపురం జిల్లా సెంజి ఆనందాపురానికి చెందిన రామ్‌శంకర్, దిండుగల్ జిల్లా నత్తం తాలూకా సెందురైకి చెందిన కార్తీక్‌రాజా, నాగపట్టణం జిల్లాకు చెందిన మహమ్మద్ జబకర్ సాదిక్ అని తెలిసింది. ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

చెల్లెల్ని రక్షించబోయి అన్న కూడా మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వాడడం తగ్గించాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడగా, ఆమెను రక్షించేందుకు యత్నించిన అన్న కూడా మృతిచెందిన ఘటన పుదుకోట జిల్లాలో చోటుచేసుకుంది. విరాళిమలై పంచాయతి మండయూర్ చోదిరాయన్‌కాడు ప్రాంతానికి చెందిన చంద్రకుమార్-జీవిత దంపతులకు మణికంఠన్ (18) అనే కుమారుడు, పవిత్ర (16) అనే కుమార్తె ఉన్నారు. మణికంఠన్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, పవిత్ర ప్లస్ వన్ చదువుతోంది. సోమవారం అర్ధరాత్రి వరకు పవిత్ర సెల్‌ఫోన్ చూస్తుండడం గమనించిన తల్లిదండ్రులు ఆమెను మందలించినట్లు సమాచారం. అదే సమయంలో మణికంఠన్ ఆగ్రహంతో పవిత్ర చేతిలోని సెల్‌ఫోన్ నేలకు కొట్టి ధ్వంసం చేశాడు. దీంతో పవిత్ర కోపంగా తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటకు పరుగు తీసి సమీపంలోని బావిలో దూకింది. ఆమెను రక్షించేందుకు మణికంఠన్ కూడా బావిలోకి దూకాడు. కానీ, ఇద్దరు నీటమునిగి మృతిచెందారు. ఈ ఘటనపై మాత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సీమాన్‌పై ఫిర్యాదు రద్దుకు హైకోర్టు నిరాకరణ

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెళ్ళి చేసుకుంటానని చెప్పి మోసగించాడంటూ నటి విజయలక్ష్మి నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్‌పై చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు జరుపుతున్న కేసును రద్దు చేసే ప్రసక్తేలేదని హైకోర్టు స్పష్టం చేసింది.. 12 వారాల్లోగా ఈకేసుకు సంబంధించి సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఆదేశించింది. 2011లో సీమాన్ తనను పెళ్ళి చేసుకుంటానని ఏమార్చారని ఆరోపిస్తూ విజయలక్ష్మి వలసరవాక్కం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదుపై పోలీసులు నమోదు చేసిన కేసును రద్దు చేయాలని సీమాన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జీకే ఇలంతిరయాన్ విచారణ జరిపారు. ఆ సందర్భంగా సీమాన్ తరఫు న్యాయవాది హాజరై 2011లో విజయలక్ష్మి పోలీసులకు చేసిన ఫిర్యాదు వాపసు చేసుకుందని, మళ్ళీ 2013లో చేసిన ఫిర్యాదు కూడా వాపసు చేసుకున్నారని, ఎవరి ప్రోద్బలం వల్లనో పోలీసుల నమోదు చేసిన కేసు రద్దు చేయాలని కోరారు. పోలీసు శాఖ తరఫు న్యాయవాది హాజరై సీమాన్‌పై విజయలక్ష్మి చేసిన ఆరోపణలను తేలికగా తీసుకోకూడదని, కేసును రద్దు చేసేలా ఉత్తర్వు జారీ చేయకూడదని కోరారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి ఇలంతిరయాన్ విజయలక్ష్మి తన ఫిర్యాదును వాపసు చేసుకున్నా లైంగిక వేధింపుల చట్టం ప్రకారం పోలీసులు సీమాన్‌కు వ్యతిరేకంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలిచ్చారు. పోలీసుల కేసును రద్దు చేయాలని సీమాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు ప్రకటించారు.



సీమాన్, విజయలక్ష్మి


త్రిభాషా విధానం కావాలా...?

● 1 నుంచి బీజేపీ సంతకాల సేకరణ

ప్యారీస్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విధానం కావాలా అనే విషయమై రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 1 నుంచి 90 రోజులు బీజేపీ ఆధ్వర్యంలో సంతకాల ఉద్యమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తెలిపారు. టి.నగర్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో డీఎంకే నేతలు ముఖ్యంగా మంత్రులు త్రిభాషా విధానంలో హిందీ నిర్బంధం చేస్తున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల కంటే విద్యార్థులు అధికంగా ఉన్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధికంగా సీబీఎస్‌ఈ పాఠ్య ప్రణాళిక అమలులో ఉందన్నారు. ఈ ప్రైవేటు పాఠశాలలు డీఎంకే నేతలు సహా పలు పార్టీల నేతలు నిర్వహిస్తున్నారన్నారు. కానీ, వారు ప్రస్తుతం వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నారన్నారు. హిందీ నిర్బంధం నూతన జాతీయ విద్యా విధానం కాదన్నారు. వారి వారి మాతృభాషల్లో చదువుకుంటున్న విద్యార్థులు హిందీ చదువుకుంటే వచ్చే ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు.

మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీపై సీబీఐ కేసు?

అడయార్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాడి ఉత్పత్తుల సంస్థ ఆవిన్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి రూ.3 కోట్ల మేరకు వసూళ్ళకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీపై సీబీఐ కేసు నమోదు చేసినట్టు తెలిసింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో పాడిపరిశ్రమల శాఖామంత్రిగా వ్యవహరించిన టీకే రాజేంద్ర బాలాజీ ఆవిన్‌లో ఉద్యోగం ఇస్తామని చెప్పి రూ.30 లక్షలు వసూలు చేసి మోసం చేసినట్టు విరుదునగర్ జిల్లాకు చెందిన అన్నాడీఎంకే నిర్వాహకుడు రవీంద్రన్ 2021 నవంబరు 15న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రాజేంద్ర బాలాజీ సహా మొత్తం ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేరోజు వివిధ శాఖల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పలువురు నుంచి సుమారు రూ.3 కోట్ల మేరకు వసూలు చేసి రాజేంద్ర బాలాజీకి అందజేసినట్టు విజయ్ నల్లతంబి అనే వ్యక్తి విరుదునగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజేంద్ర బాలాజీపై మరో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయనను 2022, జనవరి 5వ తేదీన కర్ణాటక రాష్ట్రంలో ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయనకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసింది. అయితే, తాను పెట్టిన కేసు మూడేళ్ళ అయిందని, ఈ కేసులో చార్జిషీటు దాఖలు చేయాలని రవీంద్రన్ సహా మరికొందరు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన మద్రాస్ హైకోర్టు... చార్జిషీటు దాఖలు చేయడంతో పాటు తమ ఆదేశాలను ఏమేరకు అమలు చేశారో కౌంటర్ దాఖలు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి పి.వేల్ మురుగన్ సమక్షంలో గత నెలలో ఈ పిటిషన్‌పై మళ్ళీ విచారణ జరగ్గా, రాజేంద్ర బాలాజీపై కేసు నమోదు చేసేందుకు ప్రభుత్వ అనుమతి పొందినట్టు పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ సమాధానంపై న్యాయమూర్తి అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, కోర్టు ఆదేశాలను అమలుచేయని కారణంగా ఈ కేసు విచారణను సీబీఐకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాజేంద్ర బాలాజీ సహా పలువురిపై సీబీఐ కేసు నమోదు చేసినట్టు సమాచారం.



విద్యార్థినిపై అత్యాచారం.. లారీ డ్రైవర్ అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థినిని గర్భవతిని చేసిన లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సత్యమూర్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా 13 ఏళ్ల విద్యార్థినితో పరిచయం చేసుకున్నాడు. ఆమెను వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్తెను తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు, బాలిక గర్భవతి అని నిర్ధారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చెయ్యారు మహిళా పోలీసులు, సత్యమూర్తిని అరెస్ట్ చేసారు.

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తోటకు అమర్చిన విద్యుత్ కంచెలో చిక్కుకొని ఏనుగు మృతిచెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. కాకాచ్చికుట్ట ప్రాంతంలోని ఓ చెరకు తోటలో సోమవారం రాత్రి ఓ ఏనుగు ప్రవేశించింది. ఆ సమయంలో తోట చుట్టూ వేసిన విద్యుత్ కంచె తగిలిన ఏనుగు విద్యుతాఘాతంతో మృతిచెందింది. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది అక్కడకు చేరుకొని తోట యజమాని చిన్నసామి (80)ని విచారించారు. జంతువుల నుంచి పంటను కాపాడుకునేందుకు విద్యుత్ కంచె ఏర్పాటుచేసినట్లు చిన్నసామి అంగీకరించాడు. కానీ, అనుమతి లేకుండా విద్యుత్ కంచె ఏర్పాటుచేసిన చిన్నస్వామిని అటవీ సిబ్బంది అరెస్ట్ చేశారు. అనంతరం వెటర్నరీ వైద్యులతో ఏనుగుకు పోస్టుమార్టం నిర్వహించి, సమీపంలోని అడవుల్లో పూడ్చిపెట్టారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

● అసిస్టెంట్ హెచ్‌ఎం అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన అసిస్టెంట్ ప్రధానోపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పుదుకోట జిల్లాలోని ఓ పాఠశాలలో 350 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తమపై అసిస్టెంట్ హెచ్‌ఎం లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఏడుగురు విద్యార్థినులు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరుకు ఫిర్యాదు చేశారు. అధికారులు అక్కడకు చేరుకొని విచారణ జరిపి అసిస్టెంట్ హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు, అసిస్టెంట్ హెచ్‌ఎంను అరెస్ట్ చేశారు.

ప్లస్‌వన్ విద్యార్థిని ఆత్మహత్య

అడయార్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ అవుతానన్న భయంతో ప్లస్‌వన్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కోవై జిల్లా తొండాముత్తూరు ప్రాంతానికి చెందిన గోవిందరాజ్ కుమార్తె అక్షయ శ్రీ (16) స్థానికంగా ఉండే ఒక ప్రైవేటు పాఠశాలలో ప్లస్ వన్ చదువుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి స్నానం చేసి గదికి వెళ్ళిన ఆ బాలిక తిరిగి రాలేదు. దీంతో సందేహించిన తల్లిదండ్రులు పడక గదిలోకి వెళ్ళి చూడగా, సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని కనిపించింది. దీంతో ఆ బాలికను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సోమవారం పాఠశాలలో జరిగిన సైన్స్ ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ అవుతామన్న భయంతో ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం

తిరుత్తణి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపం మిట్టకండిగై సమీపంలోని కొశస్థలి నదీతీరంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ నదిపై ఆధారపడి సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు జరుగుతోంది.. ఈ నది ఆంధ్ర రాష్ట్రానికి సరిహద్దులో ఉండడంతో ఆంధ్రతో పాటు స్థానికంగా కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పగలు, రాత్రి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. బహిరంగంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇసుక అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే భూగర్భ జలమట్టాలు తగ్గిపోయే ప్రమాదముందని, ఇదే జరిగితే ఈ ప్రాంతంలో సాగు పనులు చేపట్టలేమని, అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

50 ఏళ్లు దాటిన టీచర్లకు వైద్య పరీక్షలు

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆరోగ్య భద్రత కల్పించేలా, 2024లో 50 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు మూడేళ్లకు ఒకసారి ఫుల్ బాడీ చెకప్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, ఈ ఏడాది 50 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు, తాము పనిచేస్తున్న పాఠశాల హెచ్‌ఎం సిఫారసుతో ఈ నెల 28వ తేదిలోపు జిల్లా ప్రధాన విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. మార్చి 7వ తేదిలోపు దరఖాస్తులు పరిశీలించిన అధికారులు, జిల్లాకు 150 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ రూ.57 లక్షలు కేటాయించిందని అధికారులు తెలిపారు.

అనుమతి లేని భవనాలు కూల్చివేయండి

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లోని వాణిజ్య కాంప్లెక్స్‌లో అనుమతి లేని భవనాలను 8 వారాల్లో కూల్చివేయాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. టి.నగర్‌లోని వాణిజ్య కాంప్లెక్స్‌లో అనుమతులు లేని నిర్మాణాలు తొలగించాలని చెన్నై మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను వ్యతిరేకిస్తూ భవన యజమానులు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించిన ధర్మాసనం... అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించాలని కోరే హక్కు లేదన్నారు. అలాంటి కట్టడాలను ప్రభుత్వం చూస్తూ ఉండరాదన్నారు. అనుమతి లేని కట్టడాలను 8 వారాల్లో కూల్చివేయాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

మార్చి 26కు సీమాన్ కేసు విచారణ వాయిదా

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లర్లు సృష్టించేలా మాట్లాడారని సీమాన్‌పై నమోదైన కేసు విచారణ మార్చి 26వ తేదీకి వాయిదావేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులతో విక్రవాండి క్రిమినల్ కోర్టుకు హాజరైన సీమాన్, కోర్టుకు హాజరు మినహాయింపు కల్పించాలని మద్రాసు హైకోర్టు గత వారం పిటిషన్ వేశారు. 2019లో విక్రవాండి ఉప ఎన్నికల్లో అల్లర్లు సృష్టించేలా మాట్లాడారని సీమాన్‌పై కేసు నమోదైంది. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గురించి అసభ్యంగా మాట్లాడారని సీమాన్‌పై ఆరోపణలున్నాయి. సీమాన్‌పై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు ఉండడంతో కేసు విచారించేందుకు హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.

28 వరకు ఫుట్‌పాత్ వ్యాపారులకు గుర్తింపుకార్డులు

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫుట్ పాత్ వ్యాపారులకు గుర్తింపు కార్డుల పంపిణీ ఈ నెల 28వ తేది వరకు జరుగనుంది. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో ఫుట్ పాత్ వ్యాపారులకు చిప్ అమర్చి క్యూఆర్ కోడ్‌తో కలిగిన గుర్తింపు కార్డుల పంపిణీ గత నెల 27వ తేది నుంచి ఈ నెల 15వ తేది వరకు నిర్వహించి మొత్తం 24,573 మందికి అందజేశామన్నారు. మిగిలిన 6,567 మందికి కార్డులు అందజేసేందుకు ఈ నెల 16 నుంచి 28వ తేది వరకు అన్ని మండల కార్యాలయాల్లో కార్డులు అందజేయనున్నామని తెలిపింది. 28వ తేది తర్వాత గుర్తింపు కార్డులు లేకుండా వ్యాపారం చేసే వారిపై చర్యలు చేపడతామని జీసీసీ హెచ్చరించింది.

కాలపరిమితి ముగిసిన టోల్ ప్లాజాల తొలగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాలపరిమితి ముగిసిన టోల్ ప్లాజాలను తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి ఏవీ వేలు తెలిపారు. తిరునల్వేలిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న రోడ్లపై టోల్ ప్లాజాలు ఏర్పాటుచేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 7 మీటర్ల రోడ్డును 10 మీటర్ల రోడ్డుగా మార్చి టోల్ ప్లాజాలు ఏర్పాటుచేస్తుందన్నారు. వరదలతో దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఇంకా రాలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.600 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

మరుదమలై ఆలయానికి కార్లు నిషేధం

ప్యారీస్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా మరుదమలై మురుగన్ ఆలయానికి ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 6వ తేది వరకు కార్లలో భక్తులు వెళ్లేందుకు నిషేధం విధించారు. అలాగే, మంగళ, ఆదివారాలు, కృత్తికై, ప్రభుత్వ సెలవు రోజుల్లో ఆలయానికి ద్విచక్ర వాహనాలకు నిషేధం విధించారు. భక్తులు మెట్ల మార్గం, ఆలయం ఏర్పాటుచేసిన బస్సుల్లో మాత్రమే వెళ్లి స్వామి దర్శనం చేసుకోవాలి. ఏప్రిల్ 4వ తేది సంప్రోక్షణ జరుగనున్న నేపథ్యంలో, చేపట్టనున్న పనులు వేగవంతం చేసేలా ఈ చర్యలు చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

'ఫెంగెల్' తుఫాన్ బాధితులకు నష్టపరిహారం

● రైతులకు రూ.498.80 కోట్లు

ప్యారీస్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపానుతో నష్టపోయిన రైతులకు రూ.498.80 కోట్ల పరిహారం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... ఫెంగల్ తుపానుతో తీవ్రంగా నష్టపోయిన కడలూరు, విల్లుపురం, కళ్లకుర్చి, ధర్మపురి, కృష్ణగిరి సహా 18 జిల్లాలకు చెందిన 5,18,783 మంది రైతులకు రూ.498.80 కోట్లు పరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. తుపానుతో దెబ్బతిన్న ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర విపత్తుల నివారణ నిధుల నుంచి రూ.80 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అలాగే, తుపానుతో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం అందజేస్తున్నట్లు సీఎం ప్రకటించి, బాధితులకు అందజేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ తెలిపింది.

రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 19 మంది విద్యార్థులకు పరీక్ష

ప్యారీస్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా అదిరామ్‌పట్టి ప్రాంతంలో గుర్తింపు లేని పాఠశాలలో సీబీఎస్‌ఈ చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు మార్చిలో జరుగనున్న పబ్లిక్ పరీక్షలకు హాజరుకాలేని పరిస్థితి నెలకొంది. బాధిత విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తితో అక్టోబరులో జరుగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు అనుమతిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, సీబీఎస్‌ఈ పాఠ్య ప్రణాళికకు బదులు రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో పరీక్షలు రాసేందుకు తమను అనుమతించాలని బాధిత విద్యార్థులు విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిని అంగీకరించిన అధికారులు, పట్టుకోటలోని ప్రభుత్వ మోడల్ మహోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. వీరు మార్చిలో జరుగనున్న పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో పరీక్షలు రాస్తారని అధికారులు తెలిపారు.

తిరుచెందూరు తీరానికి తాబేలు కళేబరం

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సమీపం జేజే నగర్ సముద్రతీరానికి 50 కేజీల బరువు, మూడున్నర అడుగుల రాక్షస తాబేలు కళేబరం కొట్టుకొచ్చింది. జేజే నగర్ సముద్రతీరంలో రోజూ స్థానికులు వాకింగ్‌కు వెళ్తుంటారు. ఆ మేరకు సోమవారం ఉదయం కొంతమంది ఆ సముద్రతీరంలో వాకింగ్ చేస్తుండగా తీరంలో తాబేలు నిర్జీవంగా పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. ప్రస్తుతం తాబేళ్ల సంతానోత్పత్తి కాలం కావటంతో ఈ తాబేలు గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తుండగా అలలతాకిడిలో దండరాళ్లను ఢీకొని మృతి చెంది ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఇదే విధంగా రెండు వారాలకు ముందు రెండు తాబేళ్ల కలేబరాలు తీరానికి కొట్టుకువచ్చాయి. ఇలా సముద్రతీరంలో తాబేళ్ల కళేబరాలు కొట్టుకురావటం పట్ల స్థానికులు, జంతు ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొత్త చిత్రం పూజా దృశ్యం

సెంథిల్ - కూల్ సురేష్ కాంబోలో కొత్త చిత్రం

సీనియర్ హాస్య నటుడు సెంథిల్, నటుడు కూల్ సురేష్ కలిసి నటించే కొత్త చిత్రం పూజా కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. ఇందులో దర్శకుడు మోహన్ , రవిమరియా, బిగ్‌బాస్ రణవ్, సనమ్ శెట్టి పాల్గొని షూటింగ్ ప్రారంభించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పీఎంఎస్ సినీ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై మురళి ప్రభాకరన్ నిర్మాణ సారథ్యంలో సాయి ప్రభ మీనా దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతుంది. ఇందులో కూల్ సురేష్, సెంథిల్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా ఎంఎస్ ఆరోన్ గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్నారు. కొన్ని వందల చిత్రాల్లో తన కామెడీ పంచ్‌లతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించిన సీనియర్ నటుడు సెంథిల్ ఈ మూవీలో ఒక గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. వీరితో పాటు మహానది శంకర్, పొన్నాంబలం, కనల్ కన్నన్, సెంద్రాయన్, మురళి ప్రభాకరన్, శ్రీవిద్య, వారియర్ సతీష్, విజయ్ యోహాన్ తదితరులు నటిస్తున్నారు. పూర్తి యాక్షన్ ట్విస్టులతో యాక్షన్ భరిత కమర్షియల్ మూవీగా తెరకెక్కించే ఈ సినిమా షూటింగ్ ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో చిత్రీకరించనున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరు నుంచి సెట్స్‌పైకి తీసుకెళ్ళాలని భావిస్తున్నారు. ఈ మూవీ గురించి దర్శకుడు మాట్లాడుతూ, ఒక కుర్చీ కోసం నలుగురు గ్యాంగ్‌స్టర్లు పోటీ పడతారు. వీరిలో ఎవరు గెలుస్తారన్నదే ఈ చిత్రకథ. ఎంతో ఉత్కంఠభరితంగా సాగే ఈ మూవీ టైటిల్, ఫస్ట్‌లుక్‌ను త్వరలో విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి



'2కే లవ్‌స్టోరీ' సక్సెస్ మీట్ దృశ్యం

కంబ్యాక్ మూవీ అంటూ ప్రశంసలు

● దర్శకుడు సుశీంద్రన్

తనకు '2కే లవ్‌స్టోరీ' కమ్‌బ్యాక్ మూవీ అంటూ ఈ చిత్రాన్ని చూసిన అనేక మంది మీడియా మిత్రులు ప్రత్యేకంగా అభినందించారని చిత్ర దర్శక నిర్మాత సుశీంద్రన్ అన్నారు. సిటీ లైట్ పిక్చర్స్ పతాకంపై 2కె జనరేషన్ యూత్ మధ్య ఉండే ఫ్రెండ్‌షిప్, లవ్, ఎమోషన్స్, రొమాన్స్ తదితర అంశాలతో రూపొందించిన మూవీ '2కె లవ్‌స్టోరీ'. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా నగరంలో థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. భారీ కేక్‌ను సినిమా సీనియర్ పత్రికా విలేకరులతో కలిసి చిత్ర బృందం కట్ చేయించి సక్సెస్ వేడుకలను నిర్వహించింది. ఇందులో నిర్మాత విఘ్నేష్ సుబ్రమణియన్, దర్శకుడు సుశీంద్రన్, నటుడు జగవీర్, నటి లతిహా, నటి హరిత తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో దర్శకుడు మాట్లాడుతూ, 'ఇది నా కమ్‌బ్యాక్ మూవీగా మీడియా మిత్రులు చెప్పడం చాలా సంతోషంగా ఉంది. మూవీని 200కు పైగా థియేటర్లలో విడుదల చేసిన నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధనుంజయన్‌కు వెరీ బిగ్ థ్యాంక్స్. తన సంగీత, పాటలతో సినిమాకు మరింత బలాన్ని చేకూర్చిన సంగీత దర్శకుడు ఇమాన్‌కు, ఈ సినిమా కోసం రేయింబవళ్ళు శ్రమించిన సాంకేతిక సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



డెల్నా డవిస్

ఏడేళ్ళ తర్వాత రీఎంట్రీ ఇస్తున్న డెల్నా డవిస్

● ఫీల్‌గుడ్ మూవీగా 'లవ్ ఇంక్'

ఎంఆర్ పిక్చర్స్ బ్యానరులో నిర్మాత ఏ.మహేంద్రన్ నిర్మించే చిత్రం 'లవ్ ఇంక్'. ఈ మూవీ ద్వారా డెల్నా డవిస్ రీఎంట్రీ ఇస్తున్నారు. 2017లో విడుదలైన 'కురంగు బొమ్మై' అనే మూవీలో నటించిన ఈ ముద్దుగుమ్మ దాదాపు ఏడేళ్ళ తర్వాత మళ్ళీ వెండితెరపై కనిపించనున్నారు. 'లవ్ ఇంక్' మూవీలో రాజ్ అయ్యప్ప సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. మాలీవుడ్‌కు చెందిన ఈ భామ... 'విడియుం వరై పేచ్చు' అనే సినిమాతో కోలీవుడ్‌లో అడుగుపెట్టారు. ఆ తర్వాత '49ఓ' మూవీలో నటించారు. తమిళంలో ఆమె చివరగా 2017లో వచ్చిన 'కురంగు బొమ్మై'లో నటించారు. సినిమా అవకాశాల తగ్గిపోవడంతో బుల్లితెరవైపు వెళ్ళారు. ఇపుడు 'లవ్ ఇంక్' ద్వారా రీఎంట్రీ ఇస్తుండగా, ఇందులో సునీల్ శెట్టి, యోగిబాబు, కేపీవై ఫేం రామర్, రవి మరియా తదితరులు నటిస్తున్నారు. మేఘరాజ్ దాస్ దర్శకుడు. ఈ మూవీ చిత్రీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ 'షూటింగ్ ప్రారంభమైన తొలి రోజు నుంచి అనుకున్న ప్రకారం షూటింగ్ సాఫీగా సాగుతోంది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశకు చేరుకున్నాయి. తిరువణ్ణామలై జిల్లాలోని చెయ్యారు, దానిపరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతోంది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ జోనర్‌లో వినోదాత్మక చిత్రంగా రూపొందిస్తున్నాం' అని వివరించారు.

'విడుదలై' మూవీకి 'సీఏఐబీ' అవార్డు



అవార్డు అందుకుంటున్న వెట్రిమారన్

దర్శకుడు వెట్రిమారన్ రూపొందించిన 'విడుదలై' మూవీకి 'సినిమా ఎట్ ఇట్స్ బెస్ట్' అవార్డు వరించింది. ఈ అవార్డును దర్శకుడు వెట్రిమారన్ అందుకున్నారు. చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో 'సినిమా ఎట్ ఇట్స్ బెస్ట్' (సీఏఐబీ) అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. గత ఏడు సంవత్సరాలుగా విజయవంతంగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వెట్రిమారన్, సిద్ధార్థ్ విశ్వనాథ్, సీహెచ్ సాయి, ఖానా ఖాదర్ తదితరులు పాల్గొని ఉత్తమ కళాకారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెట్రిమారన్ మాట్లాడుతూ, 'విడుదలై' మూవీ తనకు ఒక ముఖ్యమైన చిత్రంగా నిలిచిందన్నారు. ఈ సినిమాకు అవార్డు ఇచ్చి జ్యూరీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

తండ్రీకూతుళ్లు నటించిన 'అకేనం'



'అకేనం' ఫస్ట్‌లుక్

సీనియర్ నటుడు అరుణ్ పాండియన్, ఆయన కుమార్తె కీర్తి కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'అకేనం'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మంగళవారం సినీ సెలెబ్రిటీలు విజయ్ సేతుపతి, అశోక్ సెల్వన్, ఐశ్వర్య రాజేష్, దర్శకుడు గోకుల్, హీరోయిన్ రమ్య పాండ్యన్ సంయుక్తంగా విడుదల చేశారు. సీనియర్ నటుడు అరుణ్ పాండియన్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, కీర్తి , ప్రవీణ్ రాజా, ఆదిత్య షివ్‌పింక్, రమేష్ తిలక్, జీఎం సుందర్, ఆదిత్య మేనన్, సీత తదితరులు నటించారు. ఈ ప్రాజెక్టు వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ఈ మూవీ స్క్రీన్‌ప్లే ఎంతో ఉత్కంఠభరింతగా సాగుతుంది. తమిళనాడు, పుదుచ్చేరితో పాటు ఉత్తరభారతదేశంలోని పలు ప్రాంతాల్లో చిత్రీకరించాం. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇంటర్నేషన్ స్థాయిలో ఉండాలని భావించి, ఐరోపియాలోని ప్రముఖ మ్యూజిక్ స్టూడియోలో కంపోజ్ చేసాం. అలాగే, జాతీయ అవార్డు గ్రహీత, ఒడిస్సీ నృత్య మేధావి గంగాధర్ నాయక్, ఆయన బృందం, ఉత్తర భారతీయ కళాకారులు ఒక పాట సీక్వెన్స్‌లో డ్యాన్స్ చేశారు. ఖచ్చితంగా ఈ మూవీ ప్రేక్షకులకు ఒక డిఫరెంట్‌గా ఉంటుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకోగా, పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. త్వరలోనే ఫస్ట్‌లుక్‌తో పాటు టైటిల్ రిలీజ్ చేస్తాం' అని పేర్కొన్నారు. కాగా, అరుణ్ పాండియన్, కీర్తి గతంలో 'అన్బిర్కినియాన్' అనే హిట్ మూవీలో నటించిన విషయం తెల్సిందే.

'అపోలో ఫస్ట్ మెడ్' లో తెగిన వేళ్లకు అరుదైన చికిత్స



చికిత్స తీసుకున్నవారితో వైద్యనిపుణులు డాక్టర్ వి.పురుషోత్తం, డాక్టర్ శబరి గిరీష్ అంబట్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్‌లోని అపోలో ఫస్ట్ మెడ్ హాస్పిటల్‌లో వివిధ ప్రమాదాల్లో తెగిన చేతివేళ్లు, కాలి వేళ్లకు అరుదైన శస్త్రచికిత్సఅందిస్తున్నట్లు ఆ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జెన్ డాక్టర్ వి.పురుషోత్తం తెలిపారు. నగరంలో మంగళవారం మధ్యాహ్నం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శస్త్రచికిత్స తర్వాత చేతి, కాలి వేళ్లు గతంలా సక్రమంగా పనిచేస్తాయన్నదే ఇక్కడ గమనించాల్సిన విషయమన్నారు. వేళ్ల నుండి తెగిన భాగాలను శుభ్రమైన వస్త్రంలో కట్టి, ప్లాస్టిక్ బ్యాగ్, లేదా స్టెరిలైట్ కంటైనర్‌లో ఉంచి 4 నుంచి 6 గంటల లోపు తమ ఆస్పత్రికి తరలించాలని, తెగిన ప్రాంతంలో రక్తం స్రవించకుండా తడిగుడ్డ కట్టుకోవాలని, ఈ నిబంధనలు పాటిస్తే తెగిన వేళ్లకు పునరుజ్జీవం కల్పిస్తామన్నారు. చికిత్స వివరాలు తెలుసుకునేందుకు 044-28366075/ 8754470049 అనే నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శబరి గిరీష్ అంబట్, చికిత్స అందుకున్నవారు, ఆస్పత్రి అధికారులు పాల్గొన్నారు.

టీవీకేతో తమిళనాడు ముస్లింలీగ్ పొత్తు



టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌ను సత్కరిస్తున్న తమిళనాడు ముస్లింలీగ్ నేత ముస్తఫా

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తుకుదుర్చుకుని పోటీ చేస్తామని రాష్ట్ర ముస్లింలీగ్ పార్టీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు ముస్లింలీగ్ అధ్యక్షుడు ముస్తఫా, ఆ పార్టీ నేతలు టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, పార్టీ ఎన్నికల విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునతో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా రెండు పార్టీల నాయకులు ఎన్నికల పొత్తులపై చర్చలు జరిపారు. ఈ సమావేశానంతరం ముస్తఫా మీడియాతో మాట్లాడుతూ 2026 శాసనసభ ఎన్నికల్లో టీవీకేతో పొత్తుకుదుర్చుకుంటామని తెలిపారు.

వేడుకగా 'హ్యూమానిటేరియన్ అవార్డు'ల ప్రదానోత్సవం



అడయార్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త అప్సర రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక 'హ్యూమానిటేరియన్ అవార్డు-2025' ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహాబలిపురంలోని షెరటన్ గ్రాండ్ చెన్నై రిసార్ట్ అండ్ స్పాలో ఈ వేడుక నిర్వహించారు. ఇందులో సమాజంలో స్ఫూర్తిదాయకమైన మార్పునకు విశేష కృషి చేసిన వారిని గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి గౌతమి ముఖ్య అతిథిగా హాజరవగా, ప్రముఖ పాత్రికేయుడు ఫాల్కి శర్మ కీలకోపన్యాసం చేశారు. వీరితో పాటు మల్టీటాలెంటెడ్ నటుడిగా గుర్తింపు పొందిన కాళిదాస్ జయరాం, భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్మార్ గ్రూపు ఛైర్మన్ ఎన్. కుమార్, మద్రాస్ ఈఎన్‌టీ రీసెర్చ్ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ మోహన్ కామేశ్వరన్, అపోలో ఆస్పత్రి సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి.వెంకట్, శంకర నేత్రాలయ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ సురేంద్రన్, టీటీకే హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ మాయా వరదరాజన్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సమర్జీత్ సింగ్, స్వామి తదితరులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు.

ఖైదీల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

● డిప్యూటీ సీఎం ఉదయనిధి



చేపాక్ కలైవానర్ అరంగంలో మాజీ ఖైదీలకు సహాయాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ ఖైదీల జీవితాల్లో వెలుగులు నింపటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. రాష్ట్ర మాజీ ఖైదీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపాక్ కలైవానర్ అరంగంలో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో 750 మంది మాజీ ఖైదీలకు రూ.3.75 కోట్ల మేర సహాయాలను ఆయన పంపిణీ చేశారు. రాష్ట్రంలోని జైళ్లు ఖైదీల మానసిక ప్రవర్తన మార్చే శిక్షణాలయాలుగా మారుతున్నాయని, అన్ని జైళ్లలోనూ కొత్త సదుపాయలను కల్పిస్తున్నామని చెప్పారు. ఖైదీలకు మాంసాహారం, పుష్టికరమైన శాఖాహారం అందిస్తున్నామని, వివిధ నేరాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించిన ఖైదీలంతా స్వయం సంపాదన పెంపొందించుకునేలా సహాయాలను అందిస్తున్నట్టు తెలిపారు. జైలు ఖైదీల సంక్షేమ సంఘం రాష్ట్రంలో మాత్రమే ఉందని, ఈ సంఘం ఖైదీల్లో ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవం పెంపొందిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాలను మాజీ ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు రఘుపతి, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ శంకర్‌జివాల్, జైళ్ల సంస్కరణల శాఖ సంచాలకులు మహేశ్వర్ దయాళ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్దీపకాంతుల్లో క్రూయిజ్

నగరంలో 'ఎంవీ హైబ్రిడియన్ స్కై' క్రూయిజ్ షిప్

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లండన్‌కు చెందిన నోబుల్ కాలెడోనియా యాజమాన్యంలోని 'ఎంవీ హెబ్రిడియన్ స్కై' క్రూయిజ్ షిప్ చెన్నై చేరుకుంది. 76 మంది సిబ్బంది, 92 మంది ప్రయాణీకులతో కూడిన ఈ క్రూయిజ్ సోమవారం చెన్నై చేరుకోగా, మంగళవారం సాయంత్రం శ్రీలంకలోని ట్రింకోమలీకి బయలుదేరి వెళ్లింది. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న ప్రదేశాల్లో పని చేయడానికి రూపొందించబడిన ఎంవీ హైబ్రిడియన్ స్కై 59 విలాసవంతమైన క్యాబిన్లలో 120 మంది ప్రయాణీకులకు వసతి కల్పిస్తుంది. ఈ నౌకలో విశాలమైన లాంజ్, డైనింగ్ ప్రాంతం వున్నాయి. ప్రయాణీకులందరికీ ఒకేసారి ఆహారం అందించగలిగే సదుపాయం ఇందులో వుంది. ఈ నౌక ప్రపంచ స్థాయి సౌకర్యాలను కల్పిస్తోంది. ఇందులో స్విమ్మింగ్‌పూల్, నైట్‌క్లబ్ తదితరాలన్నీ అందుబాటులో వుండడం విశేషం. ఈ క్రూయిజ్‌లో వచ్చిన ప్రయాణీకులు శాంతోమ్ బసిలికా, కపాలీశ్వరాలయం, ఫోర్ట్ సెయింట్ జార్జ్ మ్యూజియం, ప్రభుత్వం మ్యూజియం, మెరీనా బీచ్ వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించారు.

గుడియాత్తంలో 'మై వీకేసీ స్టోర్'



స్టోర్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలో 'మై వీకేసీ' స్టోర్ ఏర్పాటైంది. ఈ స్టోర్‌ను మంగళవారం వీకేసీ డైరెక్టర్ వి.రఫిక్ నేతృత్వంలో 'ఇండియన్ షూ ఫెడరేషన్' అధ్యక్షుడు అఖిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వి.రఫిక్ మాట్లాడుతూ.. భారతీయ నగరాలు, పట్టణాలకు, గ్రామీణ ప్రాంతాలకు కూడా సమకాలీన ప్రపంచ ఫ్యాషన్ తీసుకురావడమే వీకేసీ లక్ష్యమని ప్రకటించారు. ఈ స్టోర్‌లో పురుషులు, మహిళలు, యువతీయువకులు, చిన్నారులకు సరమైన ధరలకు హైఫ్యాషన్ పాదరక్షలు కూడా అందుబాటులో వుంచామన్నారు. మైవీకేసీ 14వ స్టోర్‌ను గుడియాత్తంలో ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు.



'వికటన్' వెబ్‌సైట్‌ను స్తంభింపజేసిన కేంద్రప్రభుత్వాన్ని ఖండిస్తూ మంగళవారం చెన్నై ప్రెస్‌క్లబ్ వద్ద ధర్నా చేస్తున్న పాత్రికేయులు



ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న రష్యా డిప్యూటీ రాయబారి వలేరి కొడ్చేవ్ తదితరులు



స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు నాయకుడు ఎం. సింగారవేలర్ 166 జయంతి సందర్భంగా చెన్నై జిల్లా కలెక్టరేట్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు సామినాథన్, ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు మేయర్ ఆర్ ప్రియా తదితరులు



శ్రీలంక నావికాదళం దాడులను నిరోధించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న మంత్రి అనితా రాధాకృష్ణన్, ఎంపీ కనిమొళి నాయకత్వంలో రామేశ్వరం మరపడవల జాలర్ల సంఘాల ప్రతినిధులు



ఢిల్లీ తమిళ సంఘం కళావేదిక పునర్నిర్మాణ పనుల కోసం ఆ సంఘం ప్రతినిధులకు సచివాలయంలో రూ.50 లక్షల చెక్కు అందజేస్తున్న సీఎం ఎంకే స్టాలిన్



టి.నగర్ జీఎన్ చెట్టిరోడ్డులో వున్న పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం హంస వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుపతిని 'ఎర్రర్ ఫ్రీ సిటీ'గా మారుద్దాం

● 'నక్ష' సర్వే సర్వే బ్రోచర్ల విడుదలలో కలెక్టర్ పిలుపు

తిరుపతి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): భూవివాదాలకు తెర దించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'నక్ష' (నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్) సర్వే ద్వారా తిరుపతిని ఎర్రర్ ఫ్రీ సిటీగా మారుద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. నక్ష సర్వే కింద తిరుపతి ఎంపికైన నేపథ్యంలో మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నక్ష సర్వే ద్వారా భూ రికార్డులను లోపరహితంగా తయారు చేయాలన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా భూ సమస్యలు తిరుపతి జిల్లాలో ఉన్నాయన్నారు. తాజా సర్వే విషయం యజమానికి తెలియజేసి పారదర్శకంగా చేపట్టాలన్నారు. పక్కాగా ఉండే రికార్డులు తయారు కావాలని ఎంపీ గురుమూర్తి,ఎమ్మెల్సీ సుబ్రమణ్యం ఆకాంక్షించారు. డిజిటల్ అసిస్టెంట్స్, ఎమినిటీస్ సెక్రటరీ సంబంధిత అధికారులు సర్వేను జాగ్రత్తగా చేపట్టాలని కమిషనర్ మౌర్య సూచించారు. కొత్త సర్వే ద్వారా వివాదాలకు చెక్ పెట్టాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ అనిత, ఏడీసీ చరణ్‌తేజ్, సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ దేబబ్రత పాలిత్, జిల్లా భూ రికార్డుల అధికారి అరుణ్ కుమార్, డీసీపీ మహాపాత్ర, తహసీల్దారు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.




సర్వదర్శనానికి 11 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.29 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,784

తలనీలాలు సమర్పించినవారు: 25,521



ఐటీసీఎక్స్‌లో స్టాళ్ల సందడి



తిరుపతి అర్బన్/ఎంఆర్‌పల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఆశ కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025(ఐటీసీఎక్స్)లో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద మంగళవారం సందడి నెలకొంది. ఆలయాలకు, పెద్ద సంస్థలకు, జనాలకు ఉపయోగపడే ఎన్నో పరికరాలను స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే..



దుర్లభ్ దర్శన్

ఈ పరికరాన్ని కళ్లకు అమర్చుకుంటే మహంకాళి, ఓంకారేశ్వర్, భీమ్‌శంకర్, కాశీవిశ్వనాథ్, జ్యోతిర్లింగం, అయోధ్య రామమందిరం వంటి ఉత్తరాదిన ఉండే ప్రముఖ ఆలయాలను ప్రత్యక్షంగా సందర్శించిన అనుభూతి కలుగుతుంది. దీనిని భోపాల్‌కు చెందిన టేక్‌ఎక్స్ ఆర్ మెలన్ సంస్థ తయారు చేసింది. దీని ధర రూ. 3వేలు.

కళాత్మక బల్బులు

ఢిల్లీకి చెందిన ఓరియన్ ఎలక్ట్రిక్ సంస్థ సరికొత్త డిజైన్లతో, ఆయా సంస్కృతులకు అనుగుణంగా బల్బులను తయారు చేస్తోంది. శ్రీనగర్‌లోని గంగోత్రి వంతెన, గుజరాత్‌లోని సుదర్శన్‌సేతు, హిమాచల్‌ప్రదేశ్‌లోని బాక్రానంగల్ ప్రాజెక్టుకు, అయోధ్య రామమందిరం, పరిసరాలలో 700వీధిలైట్లు అమర్చారు. ఇతర ప్రముఖ ఆలయాల సంస్కృతి, సంప్రదాయం ఆధారంగా వీధిలైట్లు అమరిక, ఆటోమెటిక్‌గా వివిధ రంగులు ప్రదర్శించే ఆర్జీబీ లైట్ల 1,500 రకాలున్నాయి. వీటి ప్రారంభ ధర రూ.5వేల నుంచి రూ. 8లక్షల వరకున్నాయి.



'మహా' సంస్కృతి వాయిద్యాలు

మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం ఏర్పాటుచేసిన 'మహా' సంస్కృతి వాయిద్యాల ప్రదర్శన అలరిస్తోంది. ఉత్తరాదిలోని షిరిడి, మహాలక్ష్మి, త్రయంబకేశ్వర్, విటల్‌రుక్మిణి, సిద్ధివినాయక, భీమ్‌శంకర్, రామతక్ వంటి ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలలో 60రకాల సంప్రదాయ, జానపద వాయిద్యాలతో ప్రదర్శనలు ఇస్తుంటారు.





ఆకట్టుకునే ట్రైబల్ ఆర్ట్స్


ఆ స్టాల్‌లో అడుగు పెట్టగానే, అనేక దేవాలయాలకు సంబంధించిన కళలు, దేవుళ్ల ప్రతిమలు, ప్రాచీన విగ్రహాలు, సంప్రదాయ బొమ్మలు ఆకట్టుకుంటాయి. రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌కు చెందిన ట్రైబల్ ఆర్ట్స్ ఇవి. ఉత్తరాది చేనేత వస్త్రాలనూ ప్రదర్శనలో ఉంచారు.





గాల్లో ఎగిరే మానవరహిత యంత్రం

ముంబైకి చెందిన ఏరోస్పేస్ టెక్నాలజీ సంస్థలో తయారైన గాల్లో ఎగిరే మానవరహిత యంత్రాలతో అనేక ఉపయోగాలున్నాయి. అత్యవసర పరిస్థితులు, వరద ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీరు, మందులు అందించవచ్చు. భద్రతా చర్యలకూ ఉపయోగపడుతుంది. ఎత్తయిన ప్రాంతాలు, గాలిగోపురాల శుభ్రతకు వినియోగించుకోవచ్చు. వీటి ప్రారంభ ధర రూ.పాతికవేలు నుంచి రూ.3కోట్ల వరకు ఉంది.



గోపురాలకు బంగారుపూత

చెన్నైకి చెందిన మంత్రగోల్డ్‌కోటింగ్ సంస్థ గోల్డ్ ఎలక్ట్రోప్లేటింగ్ టెక్నాలజీ ద్వారా ఆలయాల గోపురాలకు, ధ్వజస్తంభాలకు, విమానాప్రాకారాలకు బంగారుపూత వేస్తోంది. దాదాపు పాతికేళ్ల వరకు పసిడివర్ణం తన స్వభావాన్ని కోల్పోదని నిర్వాహకులు చెప్పారు. ఇప్పటి వరకు విజయవాడ కనక మహాలక్ష్మి, యాదిగిరిగుట్ట లక్ష్మినరసింహస్వామి ఆలయాలకు తమ సేవలను అందించారు. ఇళ్లలో పూజించే చిన్న చిన్న విగ్రహాలనూ తయారుచేస్తారు.



స్మార్ట్ లాకర్

ఆలయాల్లో భక్తుల లగేజీలను భద్రపరుచుకోవడానికి స్మార్టు లాకర్ చక్కగా ఉపయోగపడుతోంది. భక్తులు, ప్రయాణికులు, ఉద్యోగులు స్వయంగా పిన్ నెంబరు, మొబైల్‌యాప్, క్యూఆర్‌కోడ్, బయోమెట్రిక్, ఫేస్‌రికగ్నేషన్ ఆర్‌ఎఫ్ఐడీ కార్డులను ఈ లాకర్‌లో సద్వినియోగం చేసుకోవచ్చు. నిరంతరాయంగా విద్యుత్ సరపరా, ఇంటర్నెట్ సదుపాయం కలిగి ఉండాలి. ఇప్పటి వరకు జమ్మూలోని వైష్ణోదేవి ఆలయంలో 220, చెన్నైలోని రైల్వేస్టేషన్‌లో 88 లాకర్లు అమర్చారు. వీటిని పుణేలోని పూణెకు చెందిన ఫాన్జల్ స్మార్ట్ సంస్థ ప్రదర్శించింది.



ఏటీఎం ద్వారా గోల్డ్ కాయిన్స్

ఏటీఎం ద్వారా బంగారు, వెండి నాణేలు కొనుగోలు చేయవచ్చు. ఏ రోజు బంగారు, వెండి ధర ఉంటుందో అక్కడ ప్రదర్శించబడుతుంది. 5గ్రాముల నుంచి 10 గ్రాముల కాయిన్స్‌ను మనం కొనుగోలు చేయవచ్చు.





ప్రత్యేక ఆకర్షణగా ఉడిపి వాయిద్యం



కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన వాయిద్యకారులలు గంట పాటు స్టాళ్ల వద్ద చేసిన ప్రదర్శన డెలిగేట్లను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రాంతం కరతాళ ధ్వనులతో మార్మోగింది. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మైమరిపించే డిజిటల్ బోర్డులు

బెంగళూరుకు చెందిన అరమ్ వరల్డ్ ద్వారా ఆలయాలకు చక్కగా ఉపయోగపడే డిజిటల్ సొల్యూషన్ బోర్డు, ఎల్ఈడీ వీడియోవాల్, ఇన్ఫర్మేషన్ కియాస్క్, క్యూఆర్‌కోడ్ బోర్డు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, క్యూలైను మ్యానేజ్‌మెంట్ సిస్టమ్, త్రీడీ అక్షరాలతో సూచిక, బ్యానర్ బోర్డులు తయారవుతున్నాయి. వీటి ధరలు రూ.4వేల నుంచి రూ.40లక్షల వరకు ఉంది. ఇప్పటి వరకు శ్రీశైలంఆలయం, బనశంకరి ఆలయాల్లో నేమ్ బోర్డు తయారు చేయించారు.





భక్తిభావం పెంచేలా..

ఆరోమి సంస్థ ఆన్‌లైన వేదికగా దేవుడి ప్రతిమలను కీచైన్స్ టీషర్ట్స్ మీద ముద్రించి అమ్మకాలు చేపడుతోంది. ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించాలన్నది ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం.

ఐటీసీఎక్స్‌లో శ్రీవారి కల్యాణోత్సవం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం, విశ్వశాంతి కోసం తిరుపతిలోని ఐటీసీఎక్స్-2025లో భాగంగా శ్రీమన్నారాయణయాగ క్రతువు నిర్వహిస్తున్నారు. బెంగళూరు నుంచి తీసుకొచ్చిన శ్రీవారి మూలవర్లు, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు, సీతాలక్ష్మణ సహిత శ్రీరామచంద్రుడు, శ్రీమన్నారాయణుడు, నీలాదేవి విగ్రహాలను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ నుంచి రాత్రి 9గంటలకు ఏకాంతసేవ వరకు అన్ని కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం కల్యాణోత్సవం నిర్వహించారు. బుధవారం పుష్పయాగం జరగనుంది. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి 25మంది ఆగమ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక క్రతువు కొనసాగుతోంది. మొత్తం ఏడు హోమగుండాలు ఏర్పాటు చేసి నిరంతరాయంగా శ్రీమన్నారాయణ హోమం జరుగుతోంది. బుధవారం పూర్ణాహుతితో హోమం పరిసమాప్తం కానుంది. యజ్ఞాచార్యులుగా గుదిమెల్ల నరసింహాచార్యులు, బ్రహ్మగా పవనకుమారాచార్యులు వ్యవహరిస్తున్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆగమపండితులు



సదస్సులో ప్రసంగిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

వేదికపై టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, పారిశ్రామికవేత్త ఏజే శేఖర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ జాయింట్ సెక్రటరీ సునీల్‌దేశ్ పాండే, చిత్రంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఆర్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి భరత్, గిరేష్‌కులకర్ణి



కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభం

వైభవంగా ధ్వజారోహణం



స్వామి అమ్మవార్ల సమక్షంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి, ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి 29: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారు తిరుచ్చిపై ధ్వజపటంతో పాటు తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవర్ల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ ధ్వజారోహణం జరిగింది. వైఖానస శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై లిఖించి కంకణ భట్టర్ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ ప్రత్యేకాధికారి, సీవీఆర్వో డాక్టర్ రవి, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారధి, శేషాద్రిచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

మంగాపురంలో లడ్డూ ప్రసాదాలు: జేఈవో

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేసినట్లు జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీనివాస మంగాపురంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అందుబాటులో ఉంచామన్నారు. టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఆధ్వర్యంలో వాహన మండపం పక్కన ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జేఈవో ప్రారంభించారు.

పెద్దశేషుడిపై వైకుంఠనాధుడు

రాత్రి పెద్దశేష వాహనంపై వైకుంఠనాధుడు భక్తులకు దర్శనమిచ్చారు. వృషభ, అశ్వ, గజరాజులు ముందు నడుస్తుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు, గోవింద నామస్మరణలు నడుమ శ్రీదేవి, భూదేవి సమేతంగా కృష్ణావతారంలో తిరుమాడ వీధుల్లో స్వామి ఊరేగారు. అంతకు ముందు ఊంజల్ సేవను కన్నుల పండువగా నిర్వహించారు.



బ్రహ్మోత్సవాల్లో ముఖ్య సేవలు

22న గరుడసేవ, 23న స్వర్ణరథోత్సవం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం. వాహనసేవలు: ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 8 గంటల వరకు.

చిన్నారికి అనూహ్య ప్రమాదం

ఆటలాడుతుండగా గౌనుకు నిప్పంటుకుని పరిస్థితి విషమం - సాయం కోసం తండ్రి వేడుకోలు

వి.కోట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : ఆట్లాడుకుంటుండగా ప్రమాదానికి లోనై మృత్యువుతో పోరాడుతున్న తన కుమార్తెకు సాయం చేయమని ఓ తండ్రి అర్థిస్తున్నాడు. వి.కోట మండలం గాండ్లపల్లెకు చెందిన డ్రైవర్ దుర్గాప్రసాద్ కుమార్తె లక్ష్య(6) ఆదివారం సాయంత్రం పిల్లలతో ఆటలాడుతూ స్నేహితురాలి ఇంటివద్దకు పరుగు తీసింది. అక్కడ గడప వద్ద వెలిగించిన దీపం గౌనుకు తగలడంతో మంటలు అలముకున్నాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు నీళ్ళుపోసి మంటలను అదుపు చేశారు.అప్పటికే 60శాతం శరీరం కాలిపోవడంతో హుటాహుటిన కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో వేలూరు సీఎంసీ ఆసత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చిన్నారికి రెండు రోజుల పాటు చికిత్స అందించారు.పరిస్థితి కుదుట పడకపోవడంతో మంగళవారం రాత్రి చెన్నైలోని కేఎంసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు రోజూ రూ.లక్షల్లో ఖర్చవుతోందని, భరించే స్తోమత తమకు లేదని బాలిక తల్లిదండ్రులు లత, దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాతలు సాయమందించాలని అభ్యర్థిస్తున్నారు.ఫోన్‌పే నెంబరు 8618134582కు తోచినంత సాయం అందించాలని కోరుతున్నారు.కాగా వి.కోట లయన్స్ క్లబ్ తరపున చిన్నారికి రూ. 52 వేలు ఆర్థిక సాయాన్ని అందించినట్లు క్లబ్ ప్రెసిడెంట్ పీఆర్ ధీరజ్, ప్రధాన కార్యదర్శి కోలా మురుగేష్ తెలిపారు.



లక్ష్య